ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 08 | జూన్ | 2024
పేజీలు 6

## రైలులో గంజాయి పట్టివేత



3 లో

# బడిబాట ఉత్తమాటే..!

- ప్రైవేటుకు ప్రభుత్వ టీచర్ల పిల్లలు
- ఇతర శాఖల ఉద్యోగుల తీరూ ఇదే..
- ఫలితాలపై తీవ్ర ప్రభావం
- గాడిలో పడేది ఎన్నడో..?




ఫైల్

**జిల్లాలో ప్రభుత్వ విద్య నానాటికీ అజమాయిషీ లేకుండా పోతోంది.** ప్రతీ ఏటా ప్రభుత్వం చేపడుతున్న బడిబాట కార్యక్రమం ఉత్తమాటలుగానే మిగిలిపోతోంది. ప్రభుత్వబడుల్లో చేరికలు పెంచేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక అలా గురువారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలంటూ చెబుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా వారి మాటలు నవ్వుల పాలవుతున్నాయి. మీ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండీ, మా పిల్లలను మాత్రం ప్రైవేటుబడుల్లో చదవించుకుంటాం అంటూ బడిబాటలో పాల్గొనే ఉపాధ్యాయులు చెబితే బాగుంటుందని పలువురు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు.

2 లో

-ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

## గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష

# పకడ్బందీగా నిర్వహించండి



**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఈనెల తొమ్మిదిన నిర్వహించనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాలకనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్టుమెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లకు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణపై చేపట్టిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనల ప్రకారం గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణ చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటిసారిగా

మిగతా 2లో..

# ప్రజల ప్రాణాలతో చెలగాటం..!





- వైరా రిజర్వాయర్‌లోకి కలుషిత నీరు
- ఎస్ఏఆర్ రైస్‌మిల్ నీటి పైప్‌లైనే కారణం
- ప్రజలు ఆగ్రహం

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామ సమీపంలో ఉన్న ఎస్ఏఆర్ రైస్ ప్రొడక్ట్స్ ఆ మిల్లు నుంచి వచ్చే వర్ధ పదార్థాలు కలుషిత నీరు పైప్‌లైన్ వైరా

మిగతా 2లో..

# బడిబాట ఉత్తమాటే..!

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో ప్రభుత్వ విద్య నానాటికీ అజమాయిషీ లేకుండా పోతోంది. ప్రతీ ఏటా ప్రభుత్వం చేపడుతున్న బడిబాట కార్యక్రమం ఉత్తమాటలుగానే మిగిలిపోతోంది. ప్రభుత్వబడుల్లో చేరికలు పెంచేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా గురువారం లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని ప్రతీ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలంటూ చెబుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా వారి మాటలు నవ్వుల పాలవుతున్నాయి. మీ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండీ, మా పిల్లలను మాత్రం ప్రైవేటుబడుల్లో చదవించుకుంటాం అంటూ బడిబాటలో పాల్గొనే ఉపాధ్యాయులు చెబితే బాగుంటుందని పలువురు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు.

**వారి పిల్లలు ప్రైవేటు బడుల్లో ...**

జిల్లాలో ఉన్న ప్రభుత్వ టీచర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన పిల్లలు ఎక్కువ మంది ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. అంటే ప్రభుత్వ విద్యలో నాణ్యత లేదని గవర్నమెంట్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్వయంగా అంగీకరించినట్లుగానే ఉంది ఈ తంతు. ఎల్‌కేజి నుండి పదో తరగతి, రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ వరకు ఎక్కువ శాతం కార్పోరేట్ విద్యాలయాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగుల పిల్లలే ఉంటున్నారు. ఈ విషయాన్ని చాలా మంది పలు మార్లు నేరుగా ప్రశ్నిస్తున్నా వారి నుండి స్పందన లేక పోవడం గమనార్హం. ఆర్థిక బలోపేతం లేని కూలీలు, చిన్న సన్నకారు రైతులు, ప్రైవేటు కార్మాగారాల్లో రోజువారీ పనులు చేసే వారి పిల్లలకు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలు, ఉద్యోగులమైన మాపిల్లలకు కార్పోరేట్ స్కూళ్లు అనే చందంగా ఉంది.

**అంతంతమాత్రమే ఉత్తీర్ణత...**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం అంతంత మాత్రంగానే ఉంటోంది. కానీ అందరూ అర్హులైన ఉపాధ్యాయులే ఉంటారు. టిటిసి, బిఇడి చేసి ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షల్లో మంచిర్యాంకులు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారే . అన్ని అర్హతలు ఉన్నవారు బోధించే సబ్జెక్టుల్లో విద్యార్థులు చతికలపడుతున్నారు. సరైన ఫలితాలు రాకపోవడంతో ప్రభుత్వ విద్యపై నమ్మకం లేక సామాన్యులు సైతం వారి పిల్లల భవిష్యత్ కోసం తినీ, తినక, అప్పుసప్పులు చేసి ప్రైవేటు బడుల్లో చదువులు చెప్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో వచ్చే ఫలితాలు మెరుగ్గా ఉంటున్నాయి. నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తూ మరింత మంది తమ బడుల్లో చేరేందుకు ప్రయాసపడుతుంటారు. అర్హత ఉన్నవారితో పాటు టిటిసి,బిఇడి, ఎంఇడిలు లేకుండా ప్రభుత్వ విద్యాలయాల్లో తక్కువ జీతాలకు పనిచేసే ఉపాధ్యాయులు ఉన్నారు. అయినప్పటికీ వారిబోధన తీరుతో ఉత్తమ ఫలితాలు రాబడుతున్నారు. దీంతో అంతా ప్రైవేటు విద్యవైపు చూస్తున్నారు.

**లోపబూయిష్టం...**

ప్రభుత్వ విద్యాలయాల్లో లోపబూష్టమైన పద్ధతులు ఉన్నాయనే వాదన ఉంది. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు లేకపోవడంతో పాటు ఉపాధ్యాయుల కొరత ఉండటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మండలాల వారీగా విద్యావ్యవస్థను గాడిలో పెట్టాల్సిన విద్యాధికారులు సరిగా లేకపోవడం, ఉన్నవారు నాలుగైదు మండలాల్లో ఇంచార్జీలుగా విధులు నిర్వహించడంతో చదువులు సత్తుబండలుగా మారిపోతున్నాయి. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇతరత్రా యాపకాల్లో మునిగి తేలుతున్నట్లు తెలుస్తోంది. ఫలితాల విషయంలో కూడా ప్రశ్నించే వారు లేక పరిస్థితులు దిగజారుతున్నాయి. లెక్కలు, సైన్స్, ఇంగ్లీష్‌ల్లో చాలా మంది విద్యార్థులు తప్పుతున్నప్పటికీ దానిని సరిదిద్దే నాథుడే లేడు. తమకు అనుకూలంగా లేక, తమ పై పనిఒత్తిడి పెంచే ప్రభుత్వాలను సైతం ఉద్యోగులు మార్చగలరనే వాదన ఈ మధ్య తెర మీదికి వస్తోంది. ఓటు బ్యాంకు కోసం ప్రభుత్వాలు చూసీ చూడనట్లుగా పోతుండటంతో పరిస్థితులు నానాటికీ దిగజారిపోతున్నాయి. ఇలాంటి లోపబూయిష్టమైన విధానాలు విద్యావ్యవస్థలో రాజ్యమేలు తుండగా ప్రభుత్వ విద్య గాడిలో పడేదెన్నోడో అంటూ పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

# గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష పకడ్బందీగా నిర్వహించండి

(మొదటిపేజీ తరువాయి)

బయోమెట్రిక్ పద్ధతిన పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. జిల్లాలో మొత్తం 52సెంటర్లు ఏర్పాటు చేయగా 18,403 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఒక రోజు ముందే తమ పరీక్ష కేంద్రాన్ని తెలుసుకోవాలని తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్స్ టిజిఎస్పీఎస్సి సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం తొమ్మిది గంటలకే చేరుకోవాలన్నారు. ప్రతి కేంద్రంలో ఉదయం 10 గంటలకు గేట్లు మూసివేయాలని అధికారులని ఆదేశించారు. మహిళా అభ్యర్థులను తనిఖీలు చేయడానికి ప్రత్యేకంగా మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్ష హాల్‌లో వెబ్ కెమెరాల ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థికి అభ్యర్థికి ఒక మీటరు దూరం పాటించేలా చూడాలన్నారు. ప్రతి అభ్యర్థి హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి వెంట తెచ్చుకోవాలని తెలిపారు. హాల్ టికెట్ పై అభ్యర్థి ఫోటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారిచే అటెస్టెడ్ చేయించుకుని సొంత డిక్లరేషన్ రాసి ఇవ్వాలని తెలిపారు. మూడు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకు రావాలని తెలిపారు. ఫ్లయింగ్ స్కాడ్స్, డిపార్ట్‌మెంట్ అధికారులకు కూడా సెల్‌ఫోన్‌లు అనుమతి లేదన్నారు. అభ్యర్థులు షూస్, జ్యువెల్లరి వేసుకుని రాకూడదన్నారు. ఎలక్ట్రానిక్స్ గాడ్జెట్స్, సెల్‌ఫోన్లకు రికార్డింగ్ వస్తువులు, క్యాలిక్యులేటర్, వాచ్, రైటింగ్ ప్యాడ్‌లకు అనుమతి లేదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కో ఆర్డినేటర్లు, విజయ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. జాన్ బాబు, ఎస్‌బిఐటి ప్రిన్సిపాల్ డా॥ డి. రాజ్‌కుమార్, జిల్లా అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, డిపార్ట్‌మెంట్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖలో బెస్ట్ వర్కర్ అవార్డు



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం సర్కిల్ పరిధిలో వైరా డివిజన్‌లో వైరా సెక్షన్‌లో లైన్‌మేన్‌గా పనిచేస్తున్న మన డిస్కమ్ కమిటీ మెంబర్, వైరా డివిజన్ నాయకులు యూనియన్ వైరా టౌన్ లైన్‌మేన్ కృష్ణప్రసాద్‌కి బెస్ట్ వర్కర్ అవార్డు రావడం పట్ల పలువురు ఉద్యోగులు అభినందించారు. మన కంపెనీ సిఎండి వరుణ్‌రెడ్డి చేతుల ఈదుగా క్రిష్ణప్రసాద్ అవార్డు తీసుకున్న సందర్భంగా మన ఖమ్మం ప్రాంతీయ కార్యదర్శి, ఎన్‌పిడిసిఎల్ కంపెనీ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శేషగిరిరావు మాట్లాడుతూ ఇలాంటి సత్కారాలు ఎన్నో అందుకోవాలని లైన్ మేన్ కృష్ణప్రసాద్‌కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, ఖమ్మం రీజినల్ కోశాధికారి శ్రీధర్, ఖమ్మం ప్రాంతీయ అదనపు కార్యదర్శి, రూరల్ డివిజన్ కార్యదర్శి సురేష్, వైరా డివిజన్ కార్యదర్శి లైన్‌మేన్ కోటేశ్వరరావు, పలువురు అధికారులు క్రిష్ణప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం..!



రిజర్వాయర్‌లోకి వచ్చే వాగులోకి ఎవరికి కనిపించకుండా వేశారు. ఈ పైప్‌లైన్ ద్వారా వస్తున్న కలుషిత వ్యర్థ నీరు వాగు నుంచి నేరుగా రిజర్వాయర్‌లోకి చేరుతుంది. గత కొన్ని సంవత్సరాల నుండి ఈ తతంగం రహస్యంగా కొనసాగుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎవరికి ఎలాంటి అనుమానం రాకుండా కొన్ని సంవత్సరాలుగా మిల్లు నుండి వచ్చే కలుషిత నీరు రిజర్వాయర్‌లోకి చేరుతుంది. ఒక మిల్లు లేదా ఫ్యాక్టరీ పెట్టేటప్పుడు వాటికి సంబంధించి అన్ని వసతులు ఉన్నాయా, మిల్లు నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు, వ్యర్థ నీరు ఎక్కడికి వెళుతుంది. ఎక్కడైనా నిల్వ చేయాలా అనేది ఆలోచించకుండానే ఎస్ఏఆర్ మిల్‌కు అనుమతులు అధికారులు ఇచ్చేశారు. కాని ఎస్ఏఆర్ మిల్లు నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారనే చెప్పవచ్చును. మిల్లు నుంచి వచ్చే కలుషిత నీరు వాగులోకి చేరడంతో ఆ వాగులో నీరు మొత్తం ఆకుపచ్చగా మారిపోయి తెల్లటి బుజురుతో ప్రవహిస్తూ వైరా ప్రాజెక్ట్‌లోకి చేరుతుంది. ఇలాంటి కలుషిత నీరు లక్షలాది మంది ప్రజలు తాగే త్రాగునీరు అందించే వైరా రిజర్వాయర్‌లోకి సరఫరా చేయడం అంటే ప్రజలు ప్రాణాలతో చెలగాటం ఆడటమే. వైరా రిజర్వాయర్ నుండి పెద్ద ఎత్తున మూడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న గ్రామీణ ప్రాంతాలకు వైరా మున్సిపాలిటీకి సరఫరా అవుతుంది. ప్రజల దాహార్తి తీర్చే వైరా ప్రాజెక్ట్‌లో రైస్ మిల్లు నుండి వచ్చే కలుషిత నీరు రిజర్వాయర్‌లోకి పంపించడం అంటే ప్రజల ప్రాణాల పట్ల మిల్లు నిర్వాహకులకు ఎంత బాధ్యత ఉందో అర్థమవుతుంది. ప్రజల ప్రాణాల కన్నా ప్రజల ఆరోగ్యం కన్నా వారి వ్యాపారమే ముఖ్యమైన ధోరణిలో అక్కడి ఎవరికి అనుమానం రాకుండా కొంతమంది అప్పటి అధికారులు అండదండలతో మిల్లు నుండి భూమి లోపల పైపులు వేసి వైరా రిజర్వాయర్‌లోకి వచ్చే వాగులోకి పంపుతున్నారు. ఒక ఇండస్ట్రీ మిల్లుకి అనుమతులు మంజూరు చేసేటప్పుడు అప్పటి అధికారులకు ఈ మిల్లు కలుషిత నీరు ఎక్కడికి పోతుంది అనే ఆలోచన రాలేదా వచ్చిన పట్టించుకోలేదా ఎందుకంటే అధికారులకు వాస్తవాలు కనిపించడం లేదు. వాగు వైపు ఎవరు వెళ్లరు. భూమిలో లోపల వేసిన పైప్‌లైన్ ఎవరికి కనిపించదు అనే ధోరణిలో మిల్లు నిర్వాహకులు ఈ పైప్‌లైన్ ద్వారా కలుషిత నీరును రిజర్వాయర్ వచ్చే వాగులోకి పంపుతున్నారు. వాస్తవానికి ఇప్పుడు వాగుకి ఒక పక్కన ఉన్న ముళ్ళపొదలను పలువురు రైతులు తొలగించారు. ఆయన ఎవరికి అర్థం కాకుండా అక్కడ మోటార్లు నడుపుతున్నారని అనుకునే విధంగా ఒక పైప్ ఏర్పాటు చేశారు. మిల్లు నుండి వచ్చే కలుషితమైన నీరు పైప్ సహజంగా ఎవరికి కనిపించదు ఎందుకు అంటే అలా ఏర్పాటు చేశారు. అసలు నీరు పైప్‌లైన్ ద్వారా వాగులోకి వచ్చే విషయం ప్రత్యేకంగా ఓపికతో చూస్తే మాత్రమే కనిపిస్తుంది. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని వైరా రిజర్వాయర్‌లోకి కలుషిత నీరును పంపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడాలని చూస్తున్న మిల్లు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజల ఆరోగ్యం పాడుకాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఎందుకంటే మిషన్ భగీరథ ద్వారా వందల గ్రామాలకు త్రాగునీరు సరఫరా వైరా రిజర్వాయర్ నుండి జరుగుతుంది.



## గుట్కా అమ్మకాలపై పోలీసుల నిఘా..



**ప్రజాపక్షం/భద్రాచలం :** నిషేధిత గుట్కా అమ్మకాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి గుట్కాలను ఎస్సై విజయలక్ష్మీ ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. పొరుగు రాష్ట్రాల నుండి భారీ ఎత్తున గుట్కాలను దిగుమతి చేసుకుంటున్న ఇక్కడి వ్యాపారులు వాటిని అమ్మకాలు సాగిస్తున్నారు. గుట్కా నిషేదం మొదలైన తొలిరోజుల్లో గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు సాగించిన వ్యాపారులు, ఇప్పుడు బహిరంగంగానే అమ్మేస్తున్నారు. గుట్కాలు తినడం వల్ల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడడుతోంది. నోటి క్యాన్సర్‌తో పాటు ఇతర వ్యాధులు సోకడం ద్వారా ప్రాణాల్లో గాల్లో కలిసిపోతున్నాయి. తద్వారా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. బహిరంగంగా పెరిగిపోయిన గుట్కా అమ్మకాలపై మరింత నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

## పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి



**ప్రజాపక్షం/ చింతకాని :** అమ్మ ఆదర్శ పాఠశాల ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రభుత్వం కేటాయించిన కనీస మౌలిక వసతులు మెరుగుపర్చాలని, పాఠశాల పునః ప్రారంభంలోపు యుద్ధ ప్రతిపాదికన చేపట్టిన పనులు పూర్తి కావాలని జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని రాఘవాపురం, లచ్చగూడెం, నేరెడ, నాగిలిగొండ తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో పనులను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో ఎంపిక చేసిన పనులు, మరమ్మత్తులు, టాయిలెట్స్, విద్యుత్, తాగునీరు, ర్యాంపులు తదితర మౌలిక వసతుల కల్పన యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పాఠశాలలకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు వచ్చాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిఇఓ సోమశేఖరశర్మ, ఎంపిడిఓ రామయ్య, తహశీల్దార్ రమేష్, ఎంఇఓ శ్యాంసన్, ఎంపిఓ మల్లెల రవీంద్రబాబు, కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైలులో గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రైలులో అక్రమంగా తరలిస్తున్న రూ. 10 లక్షల విలువ గల గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టుకున్నారు. శుక్రవారం ఖమ్మం పరిధిలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సుంకరి రమేష్ ఆధ్వర్యంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహిస్తుండగా 23 కేజీల ఎండు గంజాయి పట్టుబడింది. దీని విలువ రూ. 10 లక్షలు ఉంటుందని సిఐ రమేష్ తెలిపారు. వాహనాల్లో గంజాయి తరలింపుపై నిఘా పెరగడంతో అక్రమార్కులు గంజాయిని రైళ్లలో తరలించడం ప్రారంభించారని సిఐ తెలిపారు. ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో రైళ్లలో తనిఖీలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ మధ్యకాలంలో రైళ్లలో తరలిస్తున్న గంజాయిని పలుమార్లు పట్టుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ నుంచి ముంబాయి వయా హైదరాబాద్ వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు సంచులలో తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఒడిశా నుంచి ఎక్కువగా గంజాయి అక్రమంగా రవాణా అవుతుందని తెలిపారు. పట్టుబడిన గంజాయిని



ఖమ్మం ఎక్సైజ్ 2 అధికారికి అప్పగించారు. గంజాయిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఏఈఎస్ తిరుపతి తదితరులు అభినందించారు. ఈ తనిఖీల్లో హరీష్, వెంకట్, హన్మంతరావు, సుధీర్, విజయ్, బేబి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గురువారం ఇదే రైలులో ఎక్సైజ్ డిటిఎఫ్ పోలీసులు 10 కేజీల గంజాయిని పట్టుకున్నారు.

# నేడు జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** సుప్రీం కోర్టు ఆదేశాను సారం నేడు శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజ్‌గోపాల్ శుక్రవారం తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు కేసులను రాజీ చేసుకునేందుకు ఎటువంటి రుసుము ఉండదని కోర్టు ఫీజు సైతం తిరిగి చెల్లిస్తారని ఆయన తెలిపారు. అప్పీల్‌కు అవకాశం లేని శాశ్వత అంతిమ పరిష్కారం లభిస్తుందని దీని వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ఇరు పార్టీలు రాజీ పడిన యెడల గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి గోడవలు జరగకుండా మంచి వాతావరణంలో జీవించే అవకాశం ఉందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడడం ద్వారా ఇరు పక్షాలు విజయం సాధించినట్లేనని తెలిపారు. లోక్ అదాలత్ నిర్వహించడానికి ఖమ్మంలో ఏడు, సత్తుపల్లిలో మూడు, మధిర లో ఒకటి లోక్ అదాలత్ బెంచ్‌లను కక్షిదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన అన్ని క్రిమినల్ కేసులను, మోటార్ వాహన ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మనోవర్తి, గృహహింస, కుటుంబ కలహాలు కేసులు తదితర అన్ని రకాల సివిల్ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి రూ.25వేల లోపు కేసులు మాత్రమే లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్, కరోనా సమయంలో పెట్టిన కేసులు, ట్రాఫిక్ చలానా కేసులు, బ్యాంకు రుణ గ్రహీతల కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చునని, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయస్థానంలో ఉన్న పెండింగ్ కేసులు కూడా సుప్రీం కోర్టు ఆదేశాను సారం ఈ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని రాజీ పడడం ద్వారా శాశ్వత అంతిమ పరిష్కారం పొందడమే కాకుండా కక్షిదారుల విలువైన సమయం, డబ్బు సైతం ఆదా అవుతుందని తెలిపారు.

# ఖమ్మంలో నేడు సుదీర్ఘ గాన లహరి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో 32 గంటలు నిర్విరామంగా 32 మంది గాయకులచే సుదీర్ఘ గాన లహరిని నిర్వహిస్తున్నట్లు స్వర మాధురిమ కల్చరల్ ఈవెంట్స్ అధ్యక్షులు ఇసనపల్లి నగేష్ తెలిపారు. శుక్రవారం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయిశ్రీ డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వారి సౌజన్యంతో స్వర మాధురిమ కల్చరల్ ఈవెంట్స్ ఖమ్మం ఆధ్వర్యంలో భక్తరామదాసు కళాక్షేత్రంలో జూన్ ఎనిమిదిన శనివారం ఉదయం 10 గంటల నుండి 32 గంటల పాటు నిర్విరామంగా 32 మంది గాయకులచే సుదీర్ఘ గాన లహరి నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. తెలుగు, హిందీ చలనచిత్ర రంగ అగ్రశ్రేణి సినీ తారాగణం నటించిన సుమారు 400 పాటలు పాడనున్నట్లు తెలిపారు. జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ 2023లో జరిగిన 30 గంటల రికార్డును అధిగమిస్తూ నూతనంగా 32 గంటలు నిర్విరామంగా 32 మంది గాయకులచే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ గాన లహరిని వంజా మాలతినాయుడుచే నిర్వహిస్తున్నట్లు నగేష్ తెలిపారు. శనివారం ఉదయం ప్రారంభమై



ఆదివారం రాత్రి ఎనిమిది గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఖమ్మం, భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, హైదరాబాద్, వరంగల్, విజయవాడ, నర్సాపూర్, కరీంనగర్, ఒంగోలు, కాకినాడ, గుంటూరు, ఏలూరు, కడప, చిత్తూరు, నెల్లూరు తదితర జిల్లాల నుంచి గాయని గాయకులు పాల్గొంటారని సీనియర్ గాయకులు వివిరెడ్డి తెలిపారు.

# దళిత, గిరిజన రైతులకు ఎరువులు ఉచితంగా ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, దళిత, గిరిజన రైతులకు ఉచితంగా ఇవ్వాలని ఏఐపీకేఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మల్లీడి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మం రూరల్‌మండలంలోని రెవిన్యూకార్యాలయంలో తహశీల్దార్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2024 ఖరీఫ్ సీజన్‌లో ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, అన్ని రకాల పంటల విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు మినీ ట్రాక్టర్స్ 50శాతం సబ్సిడీ ఇవ్వాలని స్వామినాథన్ కమిషన్ అమలు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయకార్మికసంఘం ఏఐకేఎమ్ఎస్ రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య, ఏఐపీకేఎస్ జిల్లా నాయకుడు కుర్ర వెంకన్న, వై.ఉపేందర్, ఐఎఫ్టీయు జిల్లా నాయకులు కూరాకుల పుల్లయ్య, ఏఐపీకేఎంఎస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు పుచ్చకాయల శ్రీనివాసరావు, మహంకాళి వెంకన్న పాల్గొన్నారు.



# సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో ముందస్తుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ పరీక్షలకు ఉదయం తొమ్మిది గంటల నుంచి 10 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. ఉదయం 9.30 లోపే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఉదయం 10 గంటలు దాటిన తర్వాత పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితిలో అనుమతి ఉండదని అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. పరీక్షా సమయానికి ముందస్తుగా వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాయాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ వ్యాలిడిటి ఫోటో ఐడి గుర్తింపు కార్డు తీసుకు రావాలని కలెక్టర్ సూచించారు. బయోమెట్రిక్ ఉదయం 9.30 నుంచి ప్రారంభమవుతుందని అభ్యర్థులు బయోమెట్రిక్ వేయకుండా పరీక్షా కేంద్రం వదిలి వెళ్లరాదన్నారు. అభ్యర్థుల చేతి వేళ్లపై ఎలాంటి మెహంది, టాటు లు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రంలోకి వెళ్లే ముందు తమ హాల్ టికెట్ పై పాస్ పోర్టు సైజు ఫోటోను తప్పనిసరిగా అతికించాలని ఈ ఫోటో మూడు నెలల లోపు దిగినదై ఉండాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. హాల్ టికెట్లపై ఫోటో అతికించకపోతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరని ఈ నిబంధనను హాల్ టికెట్‌లో పొందుపర్చినట్లు కలెక్టర్ తెలిపారు.

ఒక రోజు ముందుగా అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రానికి వెళ్లి చూసుకోవాలన్నారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలలో 18,403 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నందున అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లు , చేతి గడియరాలు వెంట తీసుకు రావద్దని, షూ ధరించి రావద్దన్నారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లిన అభ్యర్థి పరీక్షా సమయం ముగిసే వరకు పరీక్షా కేంద్రం వదిలి వెళ్లుటకు అనుమతించబడరని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# బడి బాటను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బడిబాట కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో కనకదుర్గ అన్నారు. మండలంలోని మంగాపురం తండా అంగన్‌వాడీ కేంద్రం ఆద్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు....బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరారు. బడిలో పిల్లలను చేర్పించే విధంగా తల్లిదండ్రులలో అవగాహన సదస్సు ను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం అందించే సౌకర్యాల ను వినియోగించుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్ తేజావత్ కోటమ్మ, పద్మ, భూక్యా అరుణ తదితరులు పాల్గొన్నారు.



# ప్రచారం చేయకుండా వేలం పాట ఎలా నిర్వహిస్తారు..?

### దుకాణాల కౌలు వేలం వాయిదా

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రంలోని శ్రీభీమేశ్వర స్వామి దేవాలయంకు చెందిన షాపులు కౌలు కు నిర్వహించిన బహిరంగ వేలం పాట వాయిదా వేశారు. దేవాలయం లో శుక్రవారం నిర్వహించిన కౌలు హక్కు బహిరంగ వేలం కు ఇరువురు మాత్రమే హజరైయ్యారు. దీంతో గ్రామానికి చెందిన కొంత మంది వేలం పాట లో పాల్గొని శాఖ అధికారులను నిలదీశారు. ఎలాంటి సమచారం లేకుండా వేలం పాట ఎలా నిర్వహిస్తారని నిలదీశారు. టమకా వేయించి, పత్రిక ప్రకటనలు, కరపత్రాలు పంపిణీ చేసిన తరువాత వేలం పాట వేయాలని గ్రామస్తులు కోరటంతో వేలం పాట ను వాయిదా వేస్తున్నట్లు దేవాదాయ శాఖ ఈవో కె.శ్రీకాంత్ ప్రకటించారు. సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ మాట్లాడారు...గతంలో దేవాలయం భూముల వేలం పాట రూ.3 లక్షలు వరకు చెల్లించలేదని, రికవరి కి చర్యలు తీసుకోవాలని కోరారు. చెల్లించని వ్యక్తులను మరోమారు పాటలో పాల్గొనకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేవాలయం ఆదాయం ను పెంచే విధంగా అభివృద్ధి కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్, అర్చకులు తాటిపాములు లక్ష్మి నరసింహాస్వామి, తుపురాణి మధుసూధన్‌చార్యులు, కొడవటిగంటి శివయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలి



### టియుడబ్ల్యూజె (టిజెఫ్) ఆధ్వర్యంలో వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ కలం కార్మికులుగా పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టియుడబ్ల్యూజె (టిజెఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి ఇ. సోమశేఖర శర్మ, ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సు దృష్ట్యా నిర్విరామంగా పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యా సంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారులు స్పందించి జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటామని అందుకు అవసరమైన సర్క్యులర్ జారీ చేస్తామని ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా ఆదేశాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జి. రమేష్‌బాబు, రజనికాంత్, మందుల ఉపేందర్, భాస్కర్, టిఎస్ చక్రవర్తి, పిన్ని సత్యనారాయణ, జానిపాషా, తిరుపతిరావు, కొరకొప్పుల రాంబాబు, దుక్కి గోపి, యలమందల జగదీష్, అశోక్, ఈశ్వరి, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించండి




**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** బడి ఈడు పిల్లలందరిని ప్రభుత్వ బడిలో చేర్పించాలని, అందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఎంపిడిఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన బడిబాట మండలస్థాయి సమన్వయ సమావేశం లో ఆయన మాట్లాడారు. 6వ తేదీ నుండి 19వ తేదీ వరకు ప్రతిరోజు ప్రతి హేబిటేషన్ లో నూ బడిబాట కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఐకెపిలు, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు సమన్వయంతో ఈ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రతిరోజూ నివేదికలను పంపించాలని అన్నారు. మండల నోడల్ అధికారి ప్రసాదరావు బడిబాట షెడ్యూల్డ్‌ను వివరించారు. ఐకెపి పిఎం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫాం అందించడానికి సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వారు ముద్రించిన బడిబాట కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఐకెపిలు, సిసిలు పాల్గొన్నారు.

## రైతు సమస్యలు పరిష్కరించాలని ధర్నా



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండలంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రగతి శీల రైతు సంఘం(ఎఐపికెఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కంగాల కన్నయ్య అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి ఎఐపికెఎస్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోకినపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఏకకాలంలో రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు అన్ని రకాల పంటలకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు 50శాతం సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. నూతన ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి వాసం బుచ్చిబాబు, నాయకులు ధర్మల శ్రీరాములు, కంగాల భూలోక్మ, కారం మల్లేష్, లక్ష్మణ్‌రావు, గోవిందరావు, రాజు, రాంబాబు, వాసం జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలపై ఇంటర్నల్ స్క్వాడ్ తనిఖీ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో విత్తన దుకాణాలను మణుగూరు ఏడిఏ తాతారావు ఇంటర్నల్ స్క్వాడ్‌గా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా స్టాక్ రిజిస్టర్, బిల్ పుస్తకాలు తనిఖీ చేశారు. అదే విధంగా రైతు కొనుగోలు చేసిన బిల్స్ తప్పని సరిగా తీసుకోవాలని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించిన దుకాణదారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు లూజ్ సంచుల్లో వున్న పత్తి విత్తనాలను కొనకుండా జాగ్రత్తపడాలని, నకిలీ విత్తనాలు వేసిన తర్వాత పంట దిగుబడి రానిపక్షంలో వెంటనే వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని, అలాగే ఎరువులు డిబిటి ద్వారా విక్రయాలు చేయాలని ఆదేశించారు. రైతులు తప్పని సరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనూష, ఏఈవో ప్రశాంత్, రైతులు, డీలర్లు పాల్గొన్నారు.

## విత్తనాల దుకాణాల తనిఖీ



**ప్రజాపక్షం/ములకలపల్లి :** మండలంలోని చాపరాలపల్లి, ములకలపల్లి, జగన్నాథపురం, పూసుగూడెంలోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ ఇంటర్నల్ స్క్వాడ్ మణుగూరు ఏడిఏ బి తాతారావు, స్థానిక ఏవో కరుణామయి కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల దుకాణాల యజమానులు స్టాక్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, కొనుగోలు, అమ్మకానికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు తప్పని సరిగా ఇవ్వాలన్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంభిస్తే అధిక దిగుబడులతో పాటు భూమి కూడా సారవంతంగా అవుతుందన్నారు. జీలుగులకు బదులుగా పెసర, వంటి పప్పు ధాన్యాలను వాడితే రైతుల ఆర్థికాభివృద్ది తో పాటు భూమి సైతం సారవంతం అవుతుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వలన ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని, సేంద్రియ వ్యవసాయానికి ప్రతి రైతు ఓ ఆవును పెంచుకోవాలని కోరారు.

# ఏఈ నిర్లక్ష్యం సాక్షిగా.. ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం..!

**- అధికారి వ్యవహారంపై ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్తులు**



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఒకటి కాదు రెండు కాదు వారం రోజులుగా విద్యుత్ స్తంభం విరిగి ఓ ఇంటిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ అధికారుల కంటికి కనిపించలేదు. దీనిపై ఆ ఇంటి యజమాని ఏఈకీ ఫిర్యాదు చేసిన కనీసం పట్టించుకోకపోవడం విశ్మయానికి గురి చేస్తుంది. ఖమ్మం రూరల్ మండలంలోన ఆరెంపులసబ్‌స్టేషన్‌పరిధిలోని కూతవేటుదూరంలో ఉన్న పొన్నెకల్లు గ్రామంలో నిర్లక్ష్మానికి నిలువుటద్దంగా నిలిచింది. బాధితుడు బత్తిని రామయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గత వారం రోజుల క్రితం ఈదురు గాలులతో కూడి వర్షానికి బీసీ కాలనీలో విద్యుత్ స్తంభం విరిగి ఇంటిపై పడింది. కాగా దీనిపై సదరు బాధితుడు ఏఈ ప్రకాష్‌కు పలుమార్లు ఫిర్యాదు చేశాడు. విద్యుత్ సరఫరా అవుతుందని ప్రమాదకరంగా సీసీరోడ్డుకు అడ్డంగా ఇంటి గోడపై పడిందని విన్నవించాడు. విద్యుత్ సరఫరా కూడా జరుగుతుందని ప్రాణాలకే ముప్పు ఉందని సమస్యను పరిష్కారం చేయాలని వేడుకున్నాడు. అయినప్పటికీ సదరు ఏఈ ప్రజల ప్రాణాలతో తనకేంటి అన్నట్టుగా అటువైపు కన్నెత్తి చూడలేదు. ఈ వ్యవహారంపై విసిగివేసారిపోయిన సదరు బాధితుడు గ్రామంలోని పంచాయతీకార్యాలయం వద్దా ఆందోళన చేసేందుకు సిద్ధమయ్యాడు. ఏది ఏమైనప్పటికీ అత్యంత ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సమస్యపై ఏఈ నిర్లక్ష్యవైఖరిపై ఉన్నతాధికారులు ఎంతైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతుంది.

**సమాచారం అందుకున్న ఏడిఈ రామకృష్ణ ...**

ఆ ప్రాంతానికి వెళ్లి ప్రమాదకరంగా ఉన్న కరెంటు స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని వేయించారు. సమస్యను తమ దృష్టికి తీసుకొచ్చినందుకు ప్రజాపక్షం దినపత్రికకు ఏడిఈ అభినందనలు తెలిపారు.

# దేవాలయ భూముల వేలంపై వివాదం

**ఎకరానికి రూ.5 వేలు డిమాండ్ చేసిన అధికారులు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం కు చెందిన భూములు కౌలు వివాదం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి కి చెందిన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం కు చెందిన 130 ఎకరాలు మంగాపురంతండా లో ఉంది. అయితే ఆ భూమి కి ప్రతీ ఏటా అక్కడి రైతులు ఎకరానికి రూ.,1,000 చెల్లిస్తున్నారు. ఈ ఏడాది సాగు కౌలు పెంపు కోసం శుక్రవారం గ్రామంలో రైతులతో సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సులోచన ఆధ్వర్యంలో సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. .ఎకరానికి కనీసం రూ.5 వేలు చెల్లించాలని కోరారు. కానీ గిరిజన రైతులు కుదరదని చెప్పారు. ఈ సీజన్ లో ఇవ్వాల్సిందేనని అధికారులు పట్టుపట్టారు. తాము ఎకరానికి రూ. .1000 కంటే ఒక్క రూపాయి కూడ చెల్లించలేమని తెల్చి చెప్పారు. దీంతో అధికారులు, రైతులు మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా గిరిజన సంఘం ప్రతినిధి ధీరావత్ రాధాకృష్ణమూర్తి మాట్లాడారు....ఏళ్ల తరబడి తాతా, ముత్తాతల నుంచి తమ కుటుంబాలు సాగు చేసుకుంటున్నామని, బీడు భూములను చెట్లు, పుట్టలను బాగు చేసి సాగు చేసుకుంటున్నామని అన్నారు. ఇప్పుడు కౌలు పేరుతో మమ్మిల్ని ఇబ్బంది పెడితే సహించేది లేదని అన్నారు. ప్రభుత్వం తమకు రుణాలు, బావులు తీసుకుంటే విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని అన్నారు. కావునా తమకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సమత, ఈవో కె.శ్రీకాంత్; రైతు సంఘం ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, నాగేశ్వరరావు, పాల్తీయ శ్రీనివాసరావు, డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షలో సత్తా చాటిన ఒకే ఇంట్లో ఇద్దరు గిరిజన బిడ్డలు

**-అభినందనలు తెలియజేసిన ఎంఎల్ఏ జారే**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** అన్నపురెడ్డిపల్లి మండలం ఇటీవల నిర్వహించిన 2024 నీటి పరీక్ష ఫలితాలలో ఒకే ఇంటి నుండి ఇద్దరు గిరిజన బిడ్డలు అక్క తమ్ముడు అర్హత సాధించడం జరిగింది. అన్నపురెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బోడ కృష్ణ, పద్మ దంపతుల కుమార్తె, కుమారుడు హిమ వర్షిని నీట్ పరీక్ష ఫలితాలలో 3432వ ర్యాంకును సాధించగా, లక్ష్మణ్ సాహిత్ 11507వ ర్యాంకును సాధించారు. వీరి ఇరువురికి ఆలిండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల నందు డాక్టర్ చదువుటకు సీట్లు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆశిస్తున్నారు. ఇద్దరు బిడ్డలు ర్యాంకులు సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అశ్వారావుపేట ఎంఎల్ఏ జారే ఆదినారాయణ స్వయంగా వారి ఇంటికి వెళ్లి వారిని అభినందించారు. రానున్న కాలంలో డాక్టర్ విద్యను అభ్యసించి డాక్టర్ లై మంచి డాక్టర్లుగా సమాజానికి సేవలందించాలని, మీరు ఎంతో మందికి ఆదర్శంగా ఉండాలని మీ విజయానికి మంచి బహుమతిని అందిస్తానని అభినందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వనమా గాంధీ, మండల నాయకులు పరుస వెంకటేశ్వర్లు, గోల్కోండ సత్యనారాయణ, దుబ్బాకుల రాము, నేరెళ్ల లాలయ్య, మరకాల లక్ష్మారెడ్డి, మాయర కృష్ణ, రుంజా బుచ్చమ్మ, రుంజ శ్రీను, గుజ్జ జమలయ్య, పూర్ణచందరరావు, మరిదు, వేణు, రాజా, శ్రీను, లాలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ - 1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత : ఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా 21 సెంటర్లలో జరిగే గ్రూప్1 పరీక్షకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి రోహిత్ రాజ్ తెలిపారు. అభ్యర్థులు ఉ.10 గం.లకు ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. కేంద్రానికి సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు బంద్ చేయాలని ఆదేశించారు. బయోమెట్రిక్ వెరిఫికేషన్‌కు అభ్యర్థులు సహకరించాలన్నారు. హాల్ టికెట్‌లోని నియమని బంధనలు తప్పని సరిగా పాటించాలని సూచించారు.

# పిల్లలు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పిల్లలు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ముసలమడుగు గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారి, ఎంపివో సునీల్ శర్మ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామ పంచాయితీలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం గ్రామ పురవీధుల్లో గ్రామ పెద్దలు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ప్రతి పిల్లలు పాఠశాలకు వచ్చి చదువుకోవాలని అందుకు తల్లిదండ్రులు బడి ఈడు పిల్లలను పాఠశాలకి పంపించే విధంగా చొరవ చూపాలని అన్నారు. మారుమూల పల్లె గ్రామాలలో విద్య కుసుమాలు ఉన్నత స్థాయికి వెళ్లి అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడు తన కుటుంబంతో పాటు తమ గ్రామాన్ని కూడా అభివృద్ధి చేసుకోవడానికి విద్య తోడ్పాటు అందిస్తుందన్నారు. నూటికి నూరు శాతం గ్రామంలో ఉన్న ప్రతి పిల్లలు చదువుకుని ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించి మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దే సామర్థ్యం ఉపాధ్యాయుల్లో ఉందన్నారు. గ్రామంలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, మధ్యాహ్నం భోజనంచ స్కూల్ యూనిఫామ్, బుక్స్, నోట్ బుక్స్ అన్ని ప్రభుత్వం నుండి వస్తాయని, మినరల్ వాటర్, అదనంగా కంప్యూటర్ డిజిటల్ క్లాస్‌లు ప్రైవేట్‌కు ధీటుగా విద్యను అందిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు హెచ్‌ఎం శారద, పంచాయితీ కార్యదర్శి రత్నకుమారి, వీవో, గ్రామ పెద్దలు కుర్సం వెంకన్న, పెసా కమిటి సభ్యులు, అంగన్వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్లూరు మండలంలో బడిబాట బైక్ యాత్ర ప్రారంభం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం చెన్నూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు దంతాల సుధాకర్ ఆధ్వర్యంలో బడిబాట ప్రచార బైక్ యాత్ర శుక్రవారం ప్రారంభమైంది. ఈ యాత్రను మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛందంగా మండల స్థాయిలో గ్రామాలలో ఈ యాత్రను ప్రారంభించడం పట్ల ఆయనను అభినందిస్తున్నామని అన్నారు. మైకు ద్వారా కరపత్రాలు పంపిణీ వీధి వీధిన ప్రచారం ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని ఆట పాటలతో కూడిన ఒత్తిడి లేని గుణాత్మక విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తుందని ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు ,ఉచిత నోట్బుక్కులు, మధ్యాహ్న భోజన పథకం, రాగిజావ, ఆరోగ్య పరీక్షలు విశాలమైన తరగతి గదులు ఇంగ్లీష్ మీడియం, ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రభుత్వ పాఠశాలలోనే లభిస్తాయని కావున తల్లిదండ్రులు ఆలోచించి, ఆలకించి తమ యొక్క పిల్లలను మన ప్రభుత్వం బడిలోనే చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి సౌకర్యాలను పొందాలని విద్యార్థుల తల్లిదండ్రులను, విద్యార్థులను కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. మధు, రాయల నాగేశ్వరరావు, కోడిశాన విజయకుమార్, శ్రీనివాసరెడ్డి, సిఆర్పిలు, ఎంఆర్సి, సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గ్రామాల్లో డ్రై డేపై అవగాహన



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు నవ్య కాంత్ సమక్షంలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది, ఆశ లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు డ్రైడేపై అవగాహన కార్యక్రమం కల్పిస్తున్నారు. ఇటీవల అడపదడపా కురిసిన వర్షాలకు ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా, డెంగ్యూ, చికెన్ గున్యా, తరుణ వ్యాధులు రాకుండా, ఉండేందుకు దోమల వ్యాప్తి ప్రబలకుండా, ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలతో ప్రతి మంగళవారం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలుపుతున్నారు. మరియు వైద్యశాఖ సిబ్బంది ప్రజలకు దోమల లార్వా గురించి వివరిస్తూ పరిసరాల పరిశుభ్రత దోమల పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలని ఇంటింటికీ అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి పరిసరాలలో తాగి పడేసిన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, పాత జాడీలు, పగిలిపోయిన కుండలు పూల కుండీలు, కూలర్లు పాత టైర్లు వాడని రోడ్లు మొదలగు వాటిలో నీరు నిలవకుండా చూసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని కోరుతూ పలు సలహాలు, సూచనలు ఇంటింటికి వెళ్లి సూచిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు రామారావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది, ప్రతి మంగళవారం, శుక్రవారం గృహ సందర్శనలు చేసి అవగాహనలు కల్పిస్తున్నట్లు వైద్యులు నవ్య కాంత్ పేర్కొన్నారు.

# ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎన్నికలు ముగిశాయని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సిపిఎం సింగరేణి మండల కమిటీ సమావేశం తలారి దేవప్రసాష్ అధ్యక్షతన జరగగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అధికార ప్రతిపక్షాలుగెలుపే లక్ష్యంగా విమర్శలు, ప్రతి విమర్శలు ఎత్తుగడలు వ్యూహరచనలు చేశాయని ప్రజలు ఓట్ల ద్వారా ఎన్నికల తీర్పు ఇచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలపై దృష్టి సారిస్తూ 420 హామీలు అమలు చేయాలని, పోడు సమస్యను పరిష్కరించాలని రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు అందుబాటులోకి తీసుకొచ్చి, ఉచితంగా అందజేయాలని, బ్యాంకు రుణాలు ఇవ్వాలని, రైతు భరోసా ఇవ్వాలని, రూ.2లక్షల రుణమాఫి వెంటనే అమలు చేయాలని, పక్కా ఇళ్ళ నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పెంచిన నిత్యవసర సరుకుల ధరలను తగ్గించాలని, లేనియెడల ఎన్నికల్లో బిజెపికి ఎదురైన సమస్య భవిష్యత్తులో కాంగ్రెస్‌కు ఎదురవుతుందని, అందుకోసం రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం కేంద్రంపై ఉద్యమబావుట ఎగిరేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేంద్ర, నాయకులు వజ్రామారావు, రేగళ్ళ మంగయ్య, దాసరి మల్లయ్య, పండగ కొండయ్య, సూరబాక ధనమ్మ, గుర్రం వెంకన్న, యనమనగండ్ల రవి, అజ్మీర శోభన్, సురబాక సర్వయ్య, బానోతు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయండి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఆదర్శ పాఠశాలల పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయితీ రాజ్ శాఖ ఈఈ ఎస్ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదర్శ పాఠశాల పనులను ఆకస్మికంగా ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రుగొండ మండలంలో 21 పాఠశాలలకు ఆదర్శ పాఠశాల పథకం క్రింద నిధులు మంజూరు కావడం జరిగిందని, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలను ఈ నెల 12పునః ప్రారంభం కావడం జరుగుతుందన్నారు. ఈలోపు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు, హెచ్‌ఎం భవాని, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడి ముద్దు.. ప్రైవేటు బడి వద్దు



**ప్రజాపక్షం/చంద్రుగొండ :** ప్రభుత్వ బడిలోనే క్వాలిటి విద్య లభిస్తుందని జెడ్‌పిహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు కే భవాని అన్నారు. శుక్రవారం మద్దుకూరు గ్రామంలో బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటి కెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం భవాని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన ఉంటుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులతో పాటు, తక్కువ శిక్షణ, అనుభవం లేని ఉపాధ్యాయుల చేత విద్యాబోధన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** నకిలీ నిల్వ ఉన్న విత్తనాలు అమ్మితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు తెలిపారు. శుక్రవారం మండలంలోని విత్తన దుకాణదారుల గోదాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత రశీదులను తప్పకుండా భద్రపరచుకోవాలన్నారు. డీలర్ల లైసెన్స్ లో స్టాక్ బోర్డులను ధరల పట్టికలను రశీదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్, మండల ప్రత్యేక అధికారి నాగ శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి జి నర్మద, ఏ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏ ఈ ఓ శరత్ తదితరులు పాల్గొన్నారు

## కల్లూరుకు చేరిన పాఠ్యపుస్తకాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** మండల వనరుల కేంద్రానికి ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు చేరినట్లు ఎం ఈ ఓ దామోదర్ ప్రసాద్ తెలిపారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు 13, 000 నోట్ పుస్తకాలు ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు 14, 000 టెక్స్ట్ పుస్తకాలు మండల వనరులకు కేంద్రానికి చేరినట్లు ఎం ఈ ఓ తెలిపారు. రెండు రోజుల్లో ప్రధానోపాధ్యాయుల ద్వారా పాఠశాలలకు చేరుతాయని ఆయన వివరించారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలంలో గల ఎరువుల దుకాణాలలో శుక్రవారం అశ్వారావుపేట టాస్క్ పోర్స్ వ్యవసాయ శాఖ ఏ డి ఏ అఫ్జల్ బేగం తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణ యజమానులు నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకొని లైసెన్స్ రద్దు చేస్తామని అన్నారు. రైతులందరూ కూడా లైసెన్సు కలిగిన దుకాణంలోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనాలని తెలిపారు. ప్రతి రైతు కూడా వారు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డివిజన్ ఏవో రామశివరావు, కరకగూడెం ఏవో చటర్జీ, వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు కొమరం లక్ష్మణరావు, రమేష్, ప్రశాంత్, అనిల్ పాల్గొన్నారు.

# రశీదును పంట చివరి వరకు దాచుకోండి

**డిఏఓ విజయనిర్మల**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును తప్పకుండా తీసుకోవాలని తీసుకున్న రశీదు పంట చివరివరకు దాచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విజయన్మిల తెలిపారు. మండల పరిదిలోని తనికెళ్లలోని విత్తనషాపును శుక్రవారం వైరా ఏడిఏ కరుణ , మండల వ్యవసాయాధికారి బాలాజీతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విత్తన షాపులో స్టాక్ రిజిష్టర్ , బిల్ బుక్స్ , ఇన్వాయిస్ , గాట్ కాపీ ని విత్తనాలు అమ్మే ప్రతి డీలర్ తప్పకుండా పెట్టుకోవాలని తెలిపారు. వీటిని లేకుండా ఎవరు వ్యాపారం చేసినా వారిమీద చట్టప్రకారం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పకుండా రశీదు ఇవ్వాలని ఆ రశీదుపై రైతు పూర్తి పేరు , సెల్ నెంబర్ , విత్తనం తయారు అయిన తేదీ , గడువు ఎప్పటి వరకు ఉంది వివరాలు ఉండాలని అన్నారు. రశీదుపై రైతు సంతకం , డీలర్ సంతకం తప్పకుండా ఉండాలని అన్నారు. ఎమ్మార్పి ధరలకంటే ఎక్కువ ధరకు విత్తనాలు అమ్మకూడదని , లూజు ప్యాకెట్ విత్తనాలు , నకిలి విత్తనాలు అమ్మొద్దని తెలిపారు. అమ్మితే పిడి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టాక్ బోర్డు ప్రతి డీలర్ తెలుగులో రాసిపెట్టాలని అన్నారు. రైతులు అన్ని విత్తనాలు ఒకే రకము అయినా బిటి జిన్ ఉంటున్న విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు.

# డిఐఈవోపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కోచింగ్ సెంటర్లకు, ప్రైవేటు కళాశాలలకు కొమ్ము కాస్తున్న ఇంటర్మీడియట్ విద్యశాఖ అధికారి (డిఐఈవో) రవిబాబు పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు కళాశాలల ఫీజుల దోపిడీని నియంత్రించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా కార్పొరేట్, ప్రైవేటు, కోచింగ్ సెంటర్ల యజమాన్యాలు తప్పుడు ర్యాంకులతో లక్షల రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని అటువంటి విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు కళాశాలలు, కోచింగ్ సెంటర్ల యజమాన్యాలు అడ్డు అదుపు లేకుండా వ్యవహరిస్తున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనుమతులు లేకుండా ఐఐటి, నీట్ కోచింగ్ ల పేరుతో లక్షల రూపాయల ఫీజులను విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని అయినా చూసి చూడనట్లుగా డిఐఈవో వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కనుసన్నల్లోనే ప్రైవేటు కళాశాలలు, కోచింగ్ సెంటర్ల యజమాన్యాలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. డిఐఈవో తో పాటు ప్రైవేటు కళాశాలలు, కోచింగ్ సెంటర్ల యజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజుల వివరాలను బోర్డులో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కరుణ్, నరేందర్, పాషా తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఆర్టీసి కండక్టర్ మృతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్లలో గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతు ఆర్టీసి కండక్టర్ పేరసాని రామారావు మృతిచెందాడు. శుక్రవారం తనికెళ్లలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతదేహం వద్ద గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం సిఐటియు జెండా కప్పారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఫోన్ ద్వారా కుటుంబసబ్యులకు సంతాపం తెలిపారు. ఈకార్యక్రమంలో కొప్పుల కృష్ణయ్య, తాళ్లపల్లి కృష్ణ , ఎస్‌కె రంజాన్ , కళ్యాణం వెంకటేశ్వరరావు , మోత్కూరి వెంకటేశ్వరరావు , తనికెళ్ల గ్రామశాఖ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు , వేముల సాంబశివరావు , చల్లా నారాయణ , చింతనిప్పు సూర్యం , యాసా ప్రభాకర్‌రావు , దారగాని రాములు , యసా వెంకటేశ్వర్లు , సిపిఐ నాయకులు పివిరావు , యాసా వెంకటేశ్వర్లు , కొణపర్తి విష్ణుమూర్తి , కాంగ్రేస్‌పార్టీ నాయకులు చింతనిప్పు నరసింహారావు , గడల నరేంద్రనాయుడు , మిట్టపల్లి శ్రీనివాసరావు , ఉపాధ్యాయసంఘం నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు , రిటైర్డ్ ఉపాధ్యాయుడు యాసా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బడిఈడు పిల్లలను బడిలో చేర్పించండి



**ప్రజాపక్షం/ఏన్కూరుః** బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరాకుల సైదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఏన్కూరు, ఏన్కూరు హరిజనవాడ, అంబేద్కర్‌నగర్, టిఎల్‌పేట గ్రామాలకు వెళ్లి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో అన్ని సౌకర్యాలతో ఉచిత విద్య, మధ్యాహ్నం భోజనం పథకం, ఉచిత దుస్తులు, నోట్ బుక్స్, రాగిజావ అందించడంతో పాటు తెలుగు, ఇంగ్లీష్ మీడియాలో బోధన చెప్పడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగ సంఘం ఏన్కూరు అధ్యక్షులు ఆవుల నరసయ్య, ఉపాధ్యాయులు రాఘవరావు, శంకర్‌రావు, సాగి సుజాత, జయలీల, ప్రేమానందం, నాగేశ్వరరావు, పార్వతి, వెంకటరత్నం, వెంకటేశ్వర్లు, బాలశౌరి, సత్యవతి, క్లస్టర్‌స్థాయి రిసోర్స్‌పర్సన్ లచ్చిరాం, కృష్ణప్రసాద్, అంగన్‌వాడీ సిబ్బంది అరుణ, పద్మ, సుశీల, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారిగా డాక్టర్ కెవి.నారాయణ



**ప్రజాపక్షం/వైరాః** ఖమ్మం జిల్లా పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారిగా డాక్టర్ కెవి.నారాయణ నూతన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వైరాలో పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయం ఖమ్మం జిల్లా గోపాలమిత్ర సంఘం నాయకులు శాలువాతో సత్కరించి స్వాగతం పలికి పలు సమస్యల గురించి సంఘ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, కార్యదర్శి డి.శేషగిరిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.కృష్ణయ్య, గోపాలమిత్రలు, సుధాకర్, కాసిం, వెంకయ్య, యాదగిరి, నాని, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సిల్వర్ మెడల్ సాధించిన గిరిజన ఆణిముత్యం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం రంగంబంజర గ్రామానికి చెందిన ధర్మసోత్ దశరద్ నాయక్, శిల్ప కుమార్తె అయిన గిరిజన ఆణిముత్యం ధర్మసోత్ సింధూప్రియా రాష్ట్రస్థాయి అథ్లటిక్స్ చాంపియన్ షిప్ పోటీలో సిల్వర్ మెడల్ సాధించింది. ఖమ్మం ఉమెన్స్ కాలేజిలో ప్రథమ సంవత్సరం చదువుతున్న సింధూప్రియా చిన్నతనం నుండి ఆటలు అంటే చాలా ఇష్టం. హన్మకొండలో నిర్వహించిన పదవో రాష్ట్రస్థాయి అథ్లటిక్స్ చాంపియన్ షిప్ పోటీలో అండర్ 20 బాలికల విభాగంలో 400మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈసందర్భంగా కళాశాల యాజమాన్యం,కోచ్‌వీరరాఘవులుసింధూప్రియాను అభినందించారు.

# రామాలయ భూముల కౌలు వేలం పాట



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని పెద్దగోపతి పంచాయతీపరిదిలోని బొట్లకుంట గ్రామం రామాలయం భూముల కౌలు వేలంపాట శుక్రవారం జరిగింది. వేలంపాటను గ్రామానికి చెందిన ఈదర లక్ష్మణరావు రూ 50 వేల రూపాయలకు దక్కించుకున్నాడు. గ్రామప్రజలు రామాలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. అధికారులు కూడా దేవాలయం అభివృద్ధికి సహకరించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు ఆర్ సమత , ఎస్‌విడి ప్రసాద్ , రామాలయం చైర్మన్ నున్నా సత్యనారాయణ , కూచిపూడి జానకిరామయ్య, గిరకల బ్రహ్మయ్య, ఈదర కోటేశ్వరరావు , కూచిపూడి నాగేశ్వరరావు , జట్లు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయానికి ఫ్యాన్‌లు బహూకరణ



**ప్రజాపక్షం/కారేపల్లిః** కారేపల్లిలో గల సాయిబాబా ఆలయానికి స్థానిక వ్యాపారి ఓరుగంటి రంగనాథ్ ఫ్యాన్‌లను బహూకరించారు. భక్తుల సౌకర్యార్థం సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసేందుకు రూ.6వేలు విలువైన నాలుగు ఫ్యాన్‌లను శుక్రవారం ఆలయ అర్చకులు నాగసాయి శర్మకు ఓరుగంటి రంగనాథ్ అందించారు. ఈ సందర్భంగా రంగనాథ్‌ను ఆలయ కమిటీ, భక్త మండలి అభినందించింది. అలాగే ఆలయ అభివృద్ధికి భక్తులు, ధాతలు సహకరించాలని సాయిబాబా భక్తమండలి విజ్ఞప్తి చేసింది.

# మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



**ప్రజాపక్షం/కారేపల్లిః** సింగరేణి మండలం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి పాల్గొనడం జరిగింది. ప్రాథమిక పాఠశాల కారేపల్లి ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణమ్మ అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి జయరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించండి, పుస్తకాలు స్కూల్ దుస్తులు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, అదేవిధంగా మనలో ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాల ఇంగ్లీష్ మీడియం స్కూల్‌గా మార్చబడిందని అన్నారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చేర్పించడం వలన వారికి నైతిక విలువలు మానవతా విలువలు అలాగే పెద్దలను గౌరవించడం నేర్పిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**ప్రజాపక్షం/ మధిర :** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యను అందించటం జరుగుతుందని, ప్రభుత్వం ఉచితంగా కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చిలుకూరు మాజీసర్పంచ్ నిడమానూరు సంధ్య, పాఠశాల హెచ్ఎం వూట్ల శంకరరావు పేర్కొన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చిలుకూరు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల నందు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో బడిబాటను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, పోషకవిలువలతో కూడిన భోజనం, విద్యావంతులైన, ప్రతిభావంతులైన ఉపాధ్యాయ బృందం, అన్ని సౌకర్యాలతో విద్యార్థులకు విద్యను అందించటం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి బంగారు భవిష్యత్‌కు మంచి బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూలక్ష్మి, సుజాత, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు డ్వాక్రా , అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.